క్లుప్తంగా

శ్రీపాదరావుకు నివాళి



మహబూబాబాద్ రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి డీఎస్పీ తిరుపతిరావు పూలమాలవేసి నివాళులర్పించారు.

తొర్రూరు: శ్రీపాదరావు ఆదర్శ నాయకుడని బోప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. బ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలో శ్రీపాదరావు జయంతి వేడుకలు నిర్వహించారు.

ఎస్సారెస్పీ జలాల పరిశీలన

కురవి: వేసవిలో రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోకుండా ఉండేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు విడుదలైన ఎస్సారెస్పీ జలాలను మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ ఆదివారం తిరుమలాపురం గ్రామం వద్ద పరిశీలించారు. కురవి, సీరోలు మండలాల్లోని అన్ని చెరువులు, కుంటలను ఎస్సారెస్పీ జలాలతో నింపుకోవాలని రైతులకు సూచించారు.

కాళోజీ వాకర్స్‌కు ఉత్తమ సేవా పురస్కారం



మహబూబాబాద్ అర్బన్: కాళోజీ వాకర్స్ అసోసియేషన్ మహబూబాబాద్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించిందని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏటూరులో 33వ ఇంటర్నేషనల్ వాకర్స్ కన్వెన్షన్‌లో సేవా పురస్కార ఎంపికలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో ఆశ్రమ ఉన్నత పాఠశాల 2006–07 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తండ రాములు, వెంకన్న, దశరథ్, అరుణ్‌కుమార్, లచ్చిరాం, మోహన్ పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి సతీమణి వేం విజయారెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, బండి వెంకటరెడ్డి పాల్గొన్నారు. భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ డాక్టర్ వివేక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కనువిందు చేస్తున్న మోదుగుపూలు



దోర్నకల్: మండలంలోని పలు గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూముల్లో మోదుగు చెట్లకు విరబూసిన ఎర్రటి పూలు కనువిందు చేస్తున్నాయి. రోడ్ల పక్కన వ్యవసాయ భూముల్లో మోదుగు చెట్లపై ఎర్రటి పూలు ఎర్రటి ఎండల్లో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

యూరియా కొరత.. రైతులకు వెత

- సరిపడా సరఫరా కావడం లేదని ఆరోపణ
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులు



యూరియా బస్తాలు

మరిపెడ రూరల్: మండలంలోని యూరియా కొరత ఏర్పడింది. గ్రామాల్లో యాసంగి వరినాట్లు వేసిన రైతులకు అవసరమైన యూరియా కొరత ఏర్పడడంతో కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. కేవలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతోపాటు ఆగ్రోస్ కేంద్రాల్లో మాత్రమే యూరియా విక్రయిస్తుండడంతో రైతాంగానికి సరిపడా యూరియా అందడం లేదు. ఆయా కేంద్రాలలోని గోడౌన్‌లోకి వచ్చిన యూరియా వచ్చినట్లే అయిపోతుండడంతో వెనకాల వచ్చిన రైతులకు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రెండు మూడు రోజులుగా ఆయా కేంద్రాల్లో పడి గాపులు గాసి యూరియాను కొనుక్కోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పీఏసీఎస్, ఆగ్రోస్‌లో హమాలితో బస్తా యూరియా ధర రూ.275నుంచి 280 వరకు ఉంటే బయట ఎరువుల దుకాణాల్లో బస్తా 45 కిలోల యూరియా రూ.350కి విక్రయిస్తున్నారు. అధిక ధర పెట్టి కొనలేక పోతున్నామని, అది కూడా ఎరువుల దుకాణాల్లో యూరియాతోపాటు పురుగు మందులు కలిపి విక్రయిస్తేనే యూరియా బస్తా ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వరి పంట కలుపు తీసే పనులు చేపట్టిన తర్వాత యూరియా వేయాలి. సమయానికి యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైన వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులు ఇబ్బందులు పడకుండా సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అధిక ధరలకు అమ్ముతున్నారు..

సొసైటీలో యూరియా అయిపోవడంతో మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణంలో బస్తా యూరియా రూ.350కి కొన్నాను. తక్కువ ధరకు ఇవ్వాలని అడిగినప్పటికీ షాపు నిర్వాహకుడు ఒప్పుకోకపోడంతో అధిక ధరకు కొన్నాను. వ్యవసాయ అధికారులు స్పందించి యూరియా బస్తాలను అందుబాటులో ఉంచాలి.

– ఎడెల్లి వెంకన్న, రైతు, గాలివారిగూడెం

ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మొద్దు



మరిపెడ పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా మాత్రమే యూరియాను రైతులకు అందజేస్తున్నాం. ఎరువుల దుకాణాల్లో బస్తా ధర ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మితే చర్యలు ఉంటాయి. అదేవిధంగా యూరియా బస్తాకు పురుగు మందులు జత చేసి విక్రయించవద్దని దుకాణదారులకు సూచించారు.

– బోడ వీరసింగ్, మండల వ్యవసాయ శాఖ అధికారి

రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న బాధితులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్ నుంచి మంగలికాలనీ వరకు జరుగుతున్న రహదారి నిర్మాణ పనుల్లో జాప్యంపై ప్రజలు ఎమ్మెల్యే మురళీనాయక్‌ను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పాలకవర్గం ఉన్నంతకాలం రహదారి నిర్మాణ పనులకు ఆటంకం కలిగించారని తెలిపారు. రహదారి నిర్మాణ పనులకు అడ్డుచెప్పే వారి ఇళ్ల ముందు కొంతమేర వదిలేసి మిగతా రోడ్డంతా వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అభ్యంతరం చెప్పే ఇంటి యజమానులు తన వద్దకు వస్తే వారి ఇళ్ల ముందు ఉన్న నిర్మాణ పనులను సైతం తన సీడీఎఫ్ నిధులతో పూర్తి చేస్తానని చెప్పారు. వేలమంది ప్రయాణికులు, ప్రజలకు ఆటంకం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని, అభివృద్ధి పనులకు కొంతమంది ఆటంకం కలిగిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నీరుటి సురేష్, పద్మం ప్రవీణ్ కుమార్, మాదరబోయిన యాకయ్య, బెజ్జం ఐలేష్, బాధితులు పాల్గొన్నారు.

కాల్వలను అన్యాక్రాంతం చేస్తే చర్యలు

దంతాలపల్లి: ఎస్సారెస్పీ కాల్వలను అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని బొడ్లాడ గ్రామంలోని ఆదివారం ఓ గృహప్రవేశ కార్యక్రమానికి వచ్చారు. ఎస్సారెస్పీ కాల్వలు అన్యాక్రాంతం అయ్యాయని, చెరువుల్లోకి సాగునీరు రావడంలేదని కార్యకర్తలు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పూడిన కాల్వలను తీసి రైతుల యాసింగి పంటలకు సాగు నీరు అందించాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురికి కార్యకర్తల కోరిక మేరకు ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, పెరుమాండ్ల మల్లేశం, జలగం నరేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

నెల్లికుదురు: నిలిచిపోయిన రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని రైతులు ముత్యాల యాకయ్య, చిర్రగోని కిరణ్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను కోరారు. ఆదివారం ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామంలో మృతుల కుటుంబాల పరామర్శకు వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు యాకయ్య, శ్రీధర్, శ్రీను, రాజు, వీరస్వామి, లాలు, బద్రు, మోహన్ పాల్గొన్నారు.

గొప్ప వీరుడు సర్వాయి పాపన్న



పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న వివేక్

మరిపెడ రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప వీరుడు అని కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ డాక్టర్ వివేక్ కొనియాడారు. మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని అదేవిధంగా గ్రామంలోని సీతారామ చంద్ర స్వామి ఆలయాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ముందుగా సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ.. పాపన్న స్ఫూర్తితో బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో విగ్రహ దాత బయ్య సోమయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్, రంగన్న గౌడ్, సంస్థ కోర్డినేటర్లు వెంకటేశ్వర్లు, విష్ణు, శివవర్మ, సోమన్న, రవి, శంకర్, ప్రవీణ్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్ కోరారు. మండలంలోని బోడగుట్ట తండాలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న కుటుంబం జిల్లాలో ఏదన్నా ఉందంటే అది జెన్నారెడ్డి కుటుంబం మాత్రమే అన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకి అండగా ఉంటూ కష్టం వచ్చిందని ఎవరు తలుపు తట్టినా నేనున్నా అంటూ కార్యకర్తలను భరత్ చందర్ రెడ్డి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాంపెల్లి నవీన్, శ్రవణ్, చరణ్, కార్తీక్, భూక్యా నవీన్, రమేష్, యువత పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తా

- ఎంపీ కడియం కావ్య



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

పెద్దవంగర: ఆలయ అభివృద్ధికి తనవంతు తోడ్పాటు అందిస్తానని ఎంపీ కడియం కావ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో ఓ వివాహ వేడుకకు ఆమె హాజరయ్యారు. గ్రామంలో ఉన్న అంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి సాయం అందించాలని స్థానికులు ఎంపీని కోరారు. దీనిపై ఆమె స్పందించారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆధ్యాత్మికత గ్రామంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దుంపల ఉప్పలయ్య, సీనియర్ నాయకులు కుమారస్వామి, వేముల వెంకన్న, యూత్ నాయకులు శోభన్, శ్రీరాం సాంబయ్య, నాయకులు దుంపల అశోక్, సోమ లక్ష్మయ్య, భిక్షం, మల్లయ్య, రామనుజం, సంజీవ, ముసుకు కవిత, తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

- ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి ఎల్లయ్య



అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన అమరుల ఆశయాలను కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్యమాదిగ పిలుపునిచ్చారు. అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. ఎంతో మంది అమరుల త్యాగ ఫలితంగా ఎస్సీ వర్గీకణ ఫలాలు దక్కుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాధా, సుధాచ నవీన్, ఎల్లయ్య, ఉపేందర్, బాలరాజు, పులి శ్రీను, క్రాంతి, ప్రవీణ్, రాజు, అరుణ, వీరభద్రం, ఎల్లమ్మ నక్క పద్మ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి శివారులో నూతనంగా నిర్మించిన సేవాలాల్ మహరాజ్ ఆలయంను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ దర్శించుకున్నారు. ఆలయంలో మేరామ యాడి సేవాలాల్ మహరాజ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం ఆలయ చైర్మన్ డీఎస్ వెంకన్న నాయక్ ఉగ్గంపల్లిలో 108 సర్వే నంబర్‌లో సాగుకు పనికిరాని బండరాళ్లతో ఉన్న ప్రభుత్వ భూమిని మేరామ యాడి సేవాలాల్ మహరాజ్ గుడి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసు మల్లేశం, ఎడ్ల మల్లయ్య , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



దోర్నకల్: పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

దోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు చేయూతనందిస్తామని కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ తెలిపారు. స్థానిక మైనారిటీ గురుకుల కళాశాల, కస్తూర్బా పాఠశాలలోని 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న బాలికలకు ఆదివారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భీమానాయక్, మాళోత్ శాంతకుమార్, బానోత్ విష్ణు, సూర్యప్రకాష్, శ్రీకాంత్, రామ్మూర్తి, శివవర్మ తదితరులు పాల్గొన్నారు.

గార్ల: డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం గార్లలోని ఆశ్రమ, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లోని బాలికలకు రాజకీయవేత్త డాక్టర్ వివేక్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శాంతికుమార్, సాయికుమార్, సూర్యప్రకాష్, శ్రీకాంత్, భీమానాయక్, సోమన్న, యుగంధర్, శ్రీను, రాంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: బయ్యారం లోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజకీయవేత్త డాక్టర్ వివేక్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులను ఆయన అందజేశారు.

రైతు సమస్యలపై ఆందోళనలు



మాట్లాడుతున్న దేవేందర్

నెహ్రూసెంటర్: దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై, రైతులపై కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఈనెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దేశ వ్యాప్త ఆందోళనలు విజయవంతం చేయాలని ఎస్‌కేఎం కన్వీనింగ్ కమిటీ సభ్యుడు గుజ్జు దేవేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో ఎస్‌కేఎం జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల పక్షాన 4, 5 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, 6వ తేదీన జిల్లా కేంద్రంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తేదీన చలో హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాకు రైతులు, ప్రజలు, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో మేక వీరన్న, గునిగంటి రాజన్న, ఎస్‌కె బాబన్న, సనప పొమ్మన్న, తండా సతీష్, కె.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దోర్నకల్: ముల్కలపల్లి సమీపంలోని ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం డోర్నకల్ పోలీసులు పట్టుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాకు చెందిన బానోత్ రమేష్ ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు.

ఎస్సారెస్పీ నీళ్లు అందించాలి

నర్సింహులపేట: మండలంలోని నర్సింహపురం బంజర, పత్తీతండాలకు చెందిన రైతులు ఎస్సారెస్పీ నీటి కోసం అధికారులతో ఆదివారం గొడవకు దిగారు. బీబీఎం–60 ప్రధాన కాల్వ నుంచి పెద్దనాగారం మీదుగా వేళ్లే ఉప కాల్వ నుంచి నీళ్లు అందిచాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఎస్సారెస్పీ అధికారితో గొడవ చేశారు.

22నుంచి జాతర

గంగారం: మండలంలోని మడగూడెం గ్రామంలోని యాప వారి ఇలవేల్పు అయిన సీదలమ్మ జాతర ఈనెల 22, 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వహన కమిటీ బాధ్యులు తలపతి యాప శ్రీను, సీమ కుమారులు యాప ముత్తమ్మలు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో జాతర కరపత్రాలను ఆవిష్కరించారు.

బియ్యం అందజేత

పెద్దవంగర: సాటి మనుషులకు సేవలు అందించడంతోనే జన్మదన్యం చేసుకోవచ్చని నేషనల్ హ్యూమన్ రైట్స్ మండల చైర్మన్ కుమ్మరి రాంమూర్తి అన్నారు. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన తాటిపాముల శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 25 కేజీల బియ్యం అందజేశాడు. కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరికి చెందిన డి.వెంకటయ్య అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, చిలువేరు సమ్మయ్యగౌడ్ భాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

బంక్ ఎదుట ఆందోళన

నర్సింహులపేట: పెట్రోల్ బంక్ కోసం లీజుకు ఇచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో ఆదివారం బాధిత రైతులు బంక్ ఎదుట ఆందోళన చేశారు. మండలంలోని గోపతండా శివారు వరంగల్–ఖమ్మం హైవేపై ఉన్న పెట్రోల్ బంక్‌కు లీజుకు తీసుకున్న వ్యక్తి వెంకన్న అట్టి భూమిని లీజుకు ఇచ్చిన వ్యక్తికి తెలియకుండానే ధరణిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని తెలియడంతో లీజుకు ఇచ్చిన అజ్మీర జగన్ కుటుంబం బంక్ ఎదుట ఆందోళన చేశారు.

మృతుడు మానుకోట వాసిగా గుర్తింపు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని సిగ్నల్ కాలనీ సమీపంలో రైలు ఢీకొని మృతిచెందిన వ్యక్తి రషీద్‌గా గుర్తించామని జీఆర్పీ కానిస్టేబుల్ గాంధీ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహం సమీపంలో నివాసం ఉండే రషీద్ శనివారం మధ్యాహ్న సమయంలో కొత్త బజారు వైపు నుంచి పాత బజారు వైపునకు వెళ్తున్న క్రమంలో పట్టాలు దాటుతుండగా షిర్డీ రైలు ఢీకొని మృతిచెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పోస్ట్ మార్టం అనంతరం వారికి అప్పగించామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

గూడూరు: మండల కేంద్రంలోని మేరుగు భరత్ సౌండ్స్ అండ్ డెకరేషన్ గోదాం ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రూ.10లక్షల ఆస్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే. విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ డెకరేషన్ యజమాని భరత్‌గౌడ్, రవీందర్‌గౌడ్‌లను ప్రమాద ఘటన విషయం అడిగి తెల్సుకున్నారు. సహాయ సహకారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి మాజీ ఎంపీటీసీ భూక్య రామచంద్రునాయక్ విద్యుదాఘాతానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆదివారం పరామర్శించారు.

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం, లక్ష్మీపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మృతుల కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చెందర్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు.

భట్రాజుల ఆత్మీయ సమ్మేళనం



తొర్రూరు: జీవిత ప్రయాణంలో నిత్యం బిజీగా ఉండే భట్రాజు కులస్తులు వృత్తి జీవితాన్ని కాసేపు పక్కన పెట్టి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని సందడి చేశారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన భట్రాజు కుల ఆత్మీయ సమ్మేళనంలో ఆరు తరాలకు చెందిన 141 కుటుంబాలు ఒకే వేదికపై కలుసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణు వర్ధన్‌రాజు, ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈమేరకు కమిటీ గ్రామ అధ్యక్షుడిగా మాందాటి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంట రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మెండు జగన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు గుర్రం నరేందర్‌రెడ్డి, కొప్పుల మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు మెండు శ్రీనివాస్‌రెడ్డి, వంటల అనిల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం ఇటీవల కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియామకమైన గంట సంజీవరెడ్డిని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా గంట బాలకృష్ణారెడ్డి, కొమ్మాల యాకుబ్‌రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గంట అశోక్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గుప్పెడంత గుడిసె.. 'కొండంత' ఆశ



గుట్టపై గుడిసెలు వేసుకుని ఉంటున్న పేదలు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పేదలు ఇళ్ల కోసం గుట్టలు, కొండలపైన గుడిసెలు వేసుకుని ఏళ్ల తరబడి జీవిస్తున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఎలాగైన ఇంటి స్థలం పొందేలా కొండపై కొండత ఆశతో వందలాది గుడిసెలు వేసుకుని పేదలు జీవిస్తున్నారు. రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం, అరకొర సౌకర్యాల నడుమ జీవితాలను వెల్లదీస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ నియామకం



నరసింహారావు, అధ్యక్షుడు

గార్ల: ఎమ్మార్పీఎస్ జీవంజిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గద్దపాటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండలంలోని జీవంజిపల్లిలో గంట శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా సంఘం జిల్లా నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య హాజరయ్యారు. ఉపాధ్యక్షుడిగా సిరిపంగి రంజిత్ మాదిగ, అధికార ప్రతినిధిగా రంపె గిరివర్మ, కోశాధికారిగా పవన్‌కుమార్, కార్యదర్శిగా చిరంజీవి, ప్రచార కార్యదర్శులుగా వంగూరి అజయ్, చైతన్యకుమార్, దేశపాక శ్రీకాంత్, ఆర్గనైజర్లుగా సాయినాథ్, నాగరాజు, గౌరవ సలహాదారులుగా గిన్నారపు సీతారాములు, కత్తుల ప్రశాంత్, జింక రవి, క్రాంతి, హనుమంతరావు, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.